ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 జయశంకర్ భూపాలపల్లి
శనివారం 8 మార్చి 2025



- ఓరుగల్లు రాజకీయ యవనికపై మెరిసిన అతివలు
- చట్టసభల్లో అడుగుపెట్టిన పలువురు మహిళా నేతలు
- జడ్పీ, కార్పొరేషన్, మున్సిపల్ చైర్‌పర్సన్లు గానూ సేవలు
- క్రీడలు, ఇతర రంగాల్లోనూ దూసుకుపోతున్న అతివలు
- ప్రభుత్వ కొలువుల్లో కీలకంగా వ్యవహరిస్తున్న పలువురు

నారీ.. విజయభేరి

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కుటుంబ వ్యవహారాల్లోనే కాదు.. ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా సత్తాచాటుతున్నారు మహిళలు. ముఖ్యంగా ఉమ్మడి ఓరుగల్లు రాజకీయ యవనికపై పురుషులకు ఏమాత్రం తీసిపోని రీతితో విజయాలు నమోదు చేస్తున్నారు. చట్టసభల్లో అడుగుపెట్టడమే కాదు ప్రజల పక్షాన గళం విప్పుతున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ అన్ని రంగాల్లోనూ సత్తాచాటుతున్నారు. ప్రభుత్వ కొలువుల్లోనూ ఉన్నత స్థానాల నుంచి కార్మికుల వరకు తమతమ విధుల్లో శక్తివంచన లేకుండా సేవలందిస్తున్నారు. ఎందరో నారీమణులు తాము ఎంచుకున్న రంగాల్లో విజయభేరి మోగించి.. ఉమ్మడి జిల్లా ప్రగతిపథంలో చెరిగని ముద్ర వేశారు.. వేస్తున్నారు. బాధ్యతల నిర్వహణలో ఒక్కొక్కరిది ఒక్కో శైలి అయినా.. ఆలోచనలు, ఆచరణలు భిన్నంగా ఉన్నా.. అంతిమంగా ప్రజాభ్యుదయమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఆకాశంలో.. అవకాశంలో సగం అంటూ చట్టసభల్లోనూ, పాలనా వ్యవస్థల్లోనూ గళం విప్పుతూ, కలం ఝళిపిస్తూ ఉమ్మడి జిల్లా ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నారు.

వివరాలు : 5 లో..

ఓరుగల్లులో బీఆర్ఎస్ రజతోత్సవ సభ

- లక్ష మందితో నిర్వహించేలా ఏర్పాట్లు
- ఉత్తర తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం తెచ్చేలా ప్రణాళిక
- వరుస ఓటములతో నిస్తేజంలో ఉన్న శ్రేణుల్లో జోష్ నింపేలా సభ
- పార్టీ సభ్యత్వంతో పాటు గ్రామ, మండల, జిల్లా కమిటీల నియామకానికి యోచన
- కేసీఆర్‌తో భేటీలో పాల్గొన్న ఓరుగల్లు నేతలు

వచ్చే నెల 27న వరంగల్ కేంద్రంగా భారీ బహిరంగ సభకు కసరత్తు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, బండా ప్రకాశ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోయినపల్లి వినోద్‌కుమార్, సిరికొండ మధుసూదనాచారి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

బీఆర్ఎస్ రజతోత్సవ సంబరాలను ఓరుగల్లు కేంద్రంగా నిర్వహించేందుకు 'గులాబీ' పార్టీ ప్రణాళిక రూపొందిస్తోంది. శుక్రవారం మాజీ సీం కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో ముఖ్యనేతలతో బీ ఆర్ఎస్ సమావేశం నిర్వహించారు. ప్రధా నంగా వరుస ఓటములతో నిస్తేజంలో ఉన్న శ్రేణుల్లో జోష్ నింపేందుకు పార్టీ 25పళ్ల ఉత్సవాలను వైభవంగా గ్రామ, గ్రామాన నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీకి ఆయువుపట్టుగా ఉన్న ఉత్తర తె లంగాణలో పూర్వవైభవం తీసుకవచ్చేం దుకు వరంగల్ కేంద్రంగా భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి కమిటీలను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించటంతో గులాబీ శ్రేణులు జోష్‌గా ఉన్నాయి.

వరంగల్‌లో సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు..

బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను వరంగల్ కేంద్రంగా నిర్వహించాలని ఆ పార్టీ ప్రాథమి కంగా నిర్ణయించింది. ఏప్రిల్ 27వ తేదీతో పార్టీ ఏర్పాటు చేసి 25 ఏళ్లవుతుండగా.. ఏప్రిల్ 24, 25, 26 తేదీల్లో హైదరాబాద్ కేంద్రంగా ప్రతినిధుల సభ నిర్వహించి, 27న వరంగల్‌లో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. పార్టీ 20వ ఆవిర్భావ వేడుకలను హైదరాబాద్‌లో నిర్వహించారు. రజతోత్సవాలను మాత్రం వ రంగల్‌లోనే నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణ యించింది. అయితే కరీంనగర్‌లో ఏర్పాటు చే యాలని కొందరు సూచించినా కేసీఆర్ వరం గల్ వైపు మొగ్గుచూపినట్టు సమాచారం. వ రంగల్‌లో సభ నిర్వహిస్తేనే ఉత్తర తెలంగా ణ రాజకీయాలపై ప్రభావం చూపుతుందని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. త్వరలోనే బహిరంగ సభ నిర్వహణకు కావాల్సిన సభ స్థలాన్ని పరిశీలించాలని వరంగల్ నేతలకు కేసీఆర్ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచా రం. కాగా, 2001, ఏప్రిల్ 27వ తేదీన జలదృ శ్యంలో టీఆర్ఎస్ పురుడుపోసుకుంది. ఆ త రువాత 2001, మే 17వ తేదీన కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కాలేజీ మైదానంలో భారీ బహి రంగ సభతో రాజకీయాల్లో పెనుమార్పులకు కేసీఆర్ నాందిపలికారు. అప్పటి జార్ఖండ్ సీఎం శిబూసోరెన్ ముఖ్యఅతిధిగా పాల్గొన్న

▸▸ మిగతా 4వ పేజీలో...

కోటి వరాల కొడవటంచ

- రేపటి నుంచి 16 వరకు లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- నిత్యపూజలతో ఆలయానికి భక్తుల తాకిడి
- వ్యాధిగ్రస్థులకు స్వామివారి దీవెనలు



స్వాగత తోరణం



స్వామివారి ఉత్సవ విగ్రహాలు

రేగొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : కోరిన వారి కొంగు బంగారం కొడవటంచ లక్ష్మీనర సింహస్వామి , నిష్ఠతో నమ్మి కొలిచిన భక్తుల కోర్కెలు తీర్చే కల్పతరవుగా స్వామివారికి పే రుంది. ప్రతీ ఏటా మార్గశుద్ధ దశమి గురువా రం నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రా రంభమై వారం రోజుల పాటు అత్యంత వైభ వంగా జరుగుతాయి. వందల ఏళ్ల చరిత్ర కలి గిన కొడవటంచ క్షేత్రం భక్తుల పాలిట కొంగు బంగారమై విలసిల్లుతోంది. మానసిక రుగ్మత లను పారదోలుతూ మొక్కిన వారి కష్టాలు తీ ర్చడంతో రోజురోజుకు భక్తుల తాకిడి పెరుగు తోంది. భక్తజన బాంధవుడిగా పే రొందిన లక్ష్మీనరసింహస్వామిపై ప్రత్యేక కథనం...

పుట్టలో వెలిసిన స్వామి వారు..

కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ చరిత్రపై ప్రజల్లో ఆసక్తికర కథ ఉంది. ఆలయ వ్యవస్థాపక ధర్మ కర్తల వంశీయుడైన తూపురాణి రంగాచార్యులు బావిలో నీళ్ళు తోడుతుండగా స్వామివారి ప్రతి మ చేదలోకి వచ్చింది. అనంతరం రంగనాథ ఆచార్యులకు కలలోకి వచ్చిన స్వామివారు తా ను బావి సమీపంలో ఉన్న పుట్టలో శిలావిగ్ర హం రూపంలో వెలసి ఉన్నట్లు చెప్పి అంతర్ధా నమైనట్లు భక్తులు చెబుతుంటారు. దీంతో రం గానాథాచార్యులు కొడవలితో పుట్టను తొలగి స్తుండగా స్వామివారి శిలకు కొడవలి తాకడం తో కొడవలి వంగిపోయింది. దీంతో అప్పటి నుంచి కొడవలిని వంచిన స్వామిగా క్షేత్రం కొడ వటంచ లక్ష్మీనరసింహస్వామిగా స్థిరపడిపో యింది. ఆలయ నిర్మాణం కూడా అదే ప్రదేశం లో నిర్మాణం జరిగినట్లు స్థానికులు చెబుతారు.

మారనున్న రూపురేఖలు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోటంచ ఆలయంపై ప్రత్యేక దృష్టి సారించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్ని ర్మాణానికి రూ.14 కోట్లు మం జూరు చేయించారు. ఈ నిధులతో ప్రాకారం నిర్మాణం, గర్భ గుడి పునర్నిర్మాణం, అతిథి గృహాలు, సెంట్రల్ లైటింగ్, షాపింగ్‌మాల్‌ల నిర్మాణం పనులు చేయిస్తు న్నారు. కోటంచకు చేరుకునే మార్గాలు భాగిర్తి పేట స్వాగత తోరణం నుంచి కోటంచ, చల్లగరి గ నుంచి కోటంచ వరకు రోడ్ల నిర్మాణాలకు శంఖుస్థాపన చేశారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు..

ప్రతి ఏటా పాల్గుణమాసంలో బ్రహ్మోత్సవా లు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ సమయంలో ప్రభబండ్లు బ్రహ్మోత్సవాలలో ప్రత్యేక ఆకర్షణ మార్చి 9వ తేదీ ఆదివారం రోజున స్వామివారికి అభిశేకం, సూర్యవాహన, శేషవాహన సేవలు, అంకురార్పణ కార్యక్రమా లు నిర్వహిస్తారు. 10వ తేదీ సోమవారం రోజు న ధ్వజారోహణం, అశ్వవాహన, పల్లకి సేవ, ఎదురుకోళ్ళు, స్వామివారి

▸▸ మిగతా 6లో..





విద్యుద్దీపాలతో వెలుగుతున్న ఆలయ ముఖ ద్వారం

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. శుక్రవా రం కలెక్టరేట్‌లో మున్సిపల్, పంచాయతీ అధికారులతో సమా వేశం నిర్వహించిన కలెక్టర్ ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై పవర్‌పా యింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్‌కు 8312 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తుదారుడికి క్రమబద్ధీకరణపై సమాచారం ఇవ్వాలన్నారు. సోమవారం భూపాలపల్లి మున్సిపా లిటీతో పాటు అన్ని మండలాల్లో దరఖాస్తుదారుల తో సమావేశం నిర్వహించాలన్నారు. మార్చి 31లోగా ఎల్ఆర్ ఎస్ ఫీజు చెల్లింపులో 25శాతం రాయితి ఇవ్వాలన్నారు. పంచా యతీ, మున్సిపాలిటీ కార్యలయాల్లో దరఖాస్తుదారుల కోసం హెల్ప్‌డెస్క్, కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. నిషేధిత జాబితా లో ఉన్న భూముల విష యంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, డీపీవో నారాయణరావు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, అన్ని మండలాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

బ్యాల వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

ములుగు జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె. ఓంకార్



సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తున్న జిల్లా బాలల పరిరక్షణ అధికారి

ఏటూరునాగారం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూ లననకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ములుగు జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె. ఓంకార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ గిరిజన భవన్‌లో ఐసీడీఎస్ ఏటూరునాగారం ప్రాజెక్టు పరిధిలోని ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం మండలాల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడి టీచర్లకు బాల్య వివాహాల నిషేధ చట్టం 2006పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి ఎస్. హరికృష్ణ అధ్యక్షత వహించా రు. ముఖ్యఅతిథిగా హాజరైన ఓంకార్ బాల్య వివాహాల నిషేధ చట్టం-2006పై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండని అమ్మాయిలకు, 21 ఏళ్లు నిండని అబ్బాయిలకు వివహం చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు .బాల్య వివాహాల సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందిం చాలని ఐసీడీఎస్ సీడీపీవో ప్రేమలత సూచించారు. ఏటూరునాగారం, మంగపేట, కన్నాయి గూడెం మండలాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, డీసీపీయూ ఓఆర్‌డబ్ల్యూ రాజు, సీహెచ్ఎల్ సూపర్‌వైజర్లు సుదర్శన్, గీత, కేస్ వర్కర్ చంటి పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమిస్తేనే సాధికారత

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే



మహిళా సిబ్బందితో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో మహిళలు సాధికారత సాధించాలంటే సవాళ్లను సమర్థవంతంగా అధిగమించాలని జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించి విధి నిర్వహణలో రాణించిన మహిళా అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉందని, వారు ఏదైనా సాధించగలరని అన్నారు. మహిళలు అన్నిరంగాల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని పేర్కొన్నారు. దేశంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలే అధిక రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఏఆర్ అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్, ఎస్సై శ్రీలత, డీపీవో ఏవో ఫర్హాన, భరోసా కోఆర్డినేటర్ మానస, సఖి కోఆర్డినేటర్ గాయత్రి, జిల్లా పరిధిలోని మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రైలులో నుంచి పడి తమిళనాడు వాసి మృతి



అన్నుకరసన్ (ఫైల్)

కేసముద్రం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం-తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య శుక్రవారం ఉదయం 8.40 గంటల ప్రాంతంలో డౌన్ లైను 425/18-20 కిలోమీటరు వద్ద వేగంగా వెళుతున్న రైలులోంచి తమిళనాడు రాష్ట్రానికి చెందిన అన్నుకరసన్(33) మృతి చెందినట్లు వరంగల్ జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ తెలిపారు. వేగంగా వెళుతున్న రైలులోంచి పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుని వద్ద లభించిన డైరీ ఆధారంగా వివరాలను గుర్తించి మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపర్చి, కుటుంబసభ్యులకు సమాచారం అందించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మునిసిపల్, జీపీల్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ బుద్ధ ప్రకాష్‌జ్యోతి సూచించారు. హైదరాబాద్ నుంచి ఎల్ఆర్ఎస్, అక్రమ లే-అవుట్స్ క్రమబద్ధీకరణపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఎల్ఆర్ఎస్, అక్రమ లే-అవుట్‌ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ పథకం ద్వారా ప్రజలకు లబ్ధి చేకూర్చే విషయంపై అవగాహన కల్పించాలని, అందుకోసం క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించాలన్నారు. మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం సబ్సిడీని ప్రభుత్వం ఇస్తోందని, దానిపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. లబ్ధిదారులు, డాక్యుమెంట్ రైటర్లు సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ వీసీలో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, అధికారులు హరిప్రసాద్, సాయిరాం, నోముల రవీందర్, శాంతికుమార్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరబెట్టుకునేందుకు మొక్కజొన్నలు తీసుకురావద్దు

చైర్మన్ గంట సంజీవరెడ్డి



కేసముద్రం మార్కెట్లో మాట్లాడుతున్న చైర్మన్ సంజీవరెడ్డి

కేసముద్రం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు తమ మొక్కజొన్నలు, ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు తీసుకురావద్దని చైర్మన్ గంట సంజీవరెడ్డి కోరారు. మార్కెట్లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కవర్‌షెడ్లు, ఓపెన్‌యార్డులో రైతులు మొక్కజొన్నలను తీసుకువచ్చి ఆరబెట్టుకుంటుండడంతో మిర్చి, ఇతర సరుకుల క్రయవిక్రయాలకు ఆటంకం కలుగుతోందని తెలిపారు. యార్డులోఆరబెట్టిన మొక్కజొన్నల వల్ల బండ్ల తోలకం, రవాణా వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. రైతులు తమ గ్రామాల వద్దనే సరుకును ఆరబెట్టుకోవాలని, కేవలం విక్రయించేందుకే మార్కెట్‌కు సరుకులను తీసుకురావాలని కోరారు. ఈ మేరకు ఆటోలో మైక్ ద్వారా మార్కెట్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి కోలా అమరలింగేశ్వర్‌రావు, ఎస్ఐ మురళీధర్‌రాజ్, కమిటీ సభ్యుడు చిదిరాల వసంతరావు ఉన్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

పెద్దవంగర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర పోలీసు స్టేషన్‌లోని విశ్రాంతి రూములో కానిస్టేబుళ్ల మద్యం తాగిన ఫొటోలు గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో.. మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి విచారణ చేపట్టి, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం రాత్రి పెద్దవంగర మండలకేంద్రంలోని పోలీసు స్టేషన్‌లోని విశ్రాంతి రూములో హెడ్ కానిస్టేబుల్ రాజారాం, కానిస్టేబుల్ మద్దెల సుధాకర్ కలిసి మద్యం సేవించారు. దీనికి సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ విచారణ చేపట్టి, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో చంద్రశేఖర్‌రెడ్డి ఇరువురిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బ్లాక్ మార్కెట్‌కు ప్రభుత్వ ధాన్యం

రైస్‌మిల్లును సీజ్ చేసిన అధికారులు



మిల్లును తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయిస్ అధికారులు

ములుగు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకున్న రైస్‌మిల్లర్‌పై సివిల్ సప్లయ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. మిల్లును సీజ్ చేశారు. మల్లంపల్లి మండలం రామచంద్రాపురం గ్రామంలోని ఉమ బిన్నీ రైస్‌మిల్లుకు 2023-24 రబీ సీజన్‌లో ప్రభుత్వం ధాన్యాన్ని కేటాయించింది. మొత్తం 1232 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లు ద్వారా ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంది. అయితే సదరు మిల్లు యజమాని ఆ మొత్తం బియ్యాన్ని పక్కదారి పట్టించాడు. బియ్యం ఇవ్వకపోవడంతో అధికారులుచర్యలకు పూనుకున్నారు.సుమారు రూ.2కోట్ల 16లక్షల 98,407ల విలువైన బియ్యాన్ని మార్కెట్‌లో అమ్ముకున్నట్లు గుర్తించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి బి.రాంపతి, డిప్యూటీ తహసీల్దార్ నితీష్, రాంచందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్‌లు శుక్రవారం మిల్లును సీజ్ చేశారు. యజమాని భూక్య ఉమాదేవిపై క్రిమినల్ కేసు నమోదు చేయించినట్లు సివిల్ సప్లయ్ అధికారి రాంపతి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హసన్‌పర్తి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ప్రైవేటు ఉద్యోగి మృతి చెందాడు. కేయూ ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... హనుమకొండ రెవెన్యూకాలనీకి చెందిన చింతల రంజిత్ (24), జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లికి చెందిన పాయిండ్ల రాధాకృష్ణలు మిత్రులు కాగా, వీరిద్దరు ఓ ప్రైవేటు పెస్టిసైడ్ కంపెనీలో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి వీరిద్దరూ కలిసి హుజూరాబాద్‌లో మిత్రుడి వివాహ వేడుకకు హాజరై తిరిగి హనుమకొండకు వస్తున్నారు. ఈ క్రమంలో భీమారం బస్టాండు సమీపంలో రంజిత్ నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌కు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో ఎంజీఎంకు తరలించగా శుక్రవారం రంజిత్ మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రాధాకృష్ణ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిపారు. రంజిత్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడి ఆత్మహత్య



నరేశ్ (ఫైల్)

మరిపెడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జీవితంపై విరక్తి చెందిన ఓ గిరిజన యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం మండలంలోని ఎల్లంపేట రెవెన్యూ పరిధి లక్ష్మాతండాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బానోత్ సింగ్యా-శాంతి దంపతుల కుమారుడు నరేశ్(24) గత సంవత్సరం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో ఆయన వెన్నుపూసకు బలమైన దెబ్బ తగిలి లేవలేని స్థితిలో అచేతనంగా ఉంటున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయాన గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా శుక్రవారం మృతి చెందారు. మరిపెడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సతీశ్‌గౌడ్ తెలిపారు.

ఇంటర్ పరీక్ష కేంద్రంలో గందరగోళం

ఓఎంఆర్ షీట్ మార్చారని విద్యార్థి ఆరోపణ

విచారణ చేపట్టిన పోలీసులు

నెల్లికుదురు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రంలో ఓఎంఆర్ షీట్ మారిందన్న సమాచారం గందరగోళానికి దారితీసింది. విద్యార్థులు ఎగ్జామ్ రాస్తున్న క్రమంలో ఇన్విజిలేటర్ ఓ విద్యార్థిని ఓఎంఆర్ షీట్‌ను మరో విద్యార్థికి ఇచ్చినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 5న ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్ష జరుగుతున్న సమయంలో ఓ విద్యార్థిని ఓఎంఆర్ షీట్ మార్చారని 100కు డయల్ చేయగా, పోలీస్‌లు శుక్రవారం విచారణ చేపట్టారు. విద్యార్థినితో పాటు విధులు నిర్వహించిన ఇన్విజిలేటర్లను విచారణ చేపట్టారు. ఓఎంఆర్‌షీట్ మార్చలేదని ఇన్విజిలేటర్లు తెలిపారు. ఓఎంఆర్ షీట్ మార్పు జరిగితే ఇంటర్ ఫలితాల అనంతరం తెలుస్తుందని విచారణలో తేలింది.

ఎన్కపల్లిలో గుప్తనిధుల తవ్వకాల కలకలం

ఐదుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాలు

మహదేవపూర్ రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ఎన్కపల్లి గ్రామంలో గుప్తనిధుల తవ్వకాలు కలకలం రేపుతున్నాయి. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సహకారంతో పలు జిల్లాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు ఈ తవ్వకాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఎస్సై పవన్ కుమార్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం... ఎన్కపల్లికి చెందిన సమ్మయ్య అనే వ్యక్తి గ్రామ శివారులో ఓచోట గుప్తనిధులు ఉన్నట్లు సూచించడంతో ఈ ముఠా తవ్వకాలకు పాల్పడినట్లు తెలిపారు. గ్రామస్తులద్వారా సమాచారం తెలుసుకున్న ఎస్సై ఘటన స్థలానికి వెళ్లడంతో పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో ఇంజాపూర్ వెంకట రమణ(ఆదిలాబాద్‌టౌన్), పల్లపు నరసింహ(జనగామ జిల్లా), షేక్ షరీఫోద్దీన్(భువనగిరి జిల్లా), ఎండీ రియాజ్(రాజన్న సిరిసిల్ల జిల్లా), పిల్లి అశోక్‌కుమార్(రాజన్న సిరిసిల్ల జిల్లా)లు ఉండగా వీరికి సహకరించిన సమ్మయ్య అనే గ్రామస్తుడు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. వీరంతా డిజిటల్ మెటల్ డిటెక్టర్ పరికరాలతో పాటు తవ్వేందుకు ఉపయోగించే పరికరాలు, 20 నిమ్మకాయలు, పసుపు నీళ్లతో పూజలు చేసినట్లు తెలిపారు. టీఎస్23 సీ4743 నంబరు గల ఫోర్డు ఫిగో కారులో వచ్చి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేయడంతో పాటు కారు, సామగ్రిని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

8 మంది అరెస్టు

నెల్లికుదురు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా విద్యుత్ తీగలతో చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతికి కారణమైన కేసులో శుక్రవారం రాత్రి 8 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. ఫిబ్రవరి 19న మేచరాజుపెల్లి శివారు ఆకేరు వాగులో విద్యుత్ తీగలతో చేపలు పడుతన్న క్రమంలో జాటోత్ రెడ్యా విద్యుదాఘాతంతో మృతి చెందాడన్నారు. ఈ కేసులో వేచరాజుపెల్లి తండాకు చెందిన ధరంసోత్‌రెడ్య, ధరంసోత్ బీకు, గుగులోత్ రాజు, గుగులోత్ సోముల, గుగులోత్ మోహన్, బాదావత్ తిరుమలేష్, జాటోత్ నర్సింహ, జాటోత్ నానులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పథకాల అమలును ప్రజలకు వివరించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజల్లోకి వెళ్లేలా గడప గడపకు ప్రచారం చేసే బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల అధ్యక్షుడు సుంకరి రాంచంద్రయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు హాజరై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో గల అధ్యక్షులు, ఇతర నాయకులు ఘన విజయం సాధించేలా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. దీని కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రతి గడపకు చేరేలా చెప్పాలని అన్నారు. వీలైనన్నీ ఎక్కువ గ్రామాల్లో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగేలా చేయాలని సూచించారు. పాత కొత్త అని తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని చెప్పారు. ప్రతి ప్రభుత్వ పథకం అర్హులైన లబ్ధిదారుడికే అందేలా కృషి చేసే బాధ్యత ప్రతీ కార్యకర్తదేనని స్పష్టం చేశారు. అనంతరం ఎంపీటీసీ పరిధిలోని గ్రామపంచాయతీలకు సమన్వయ కమిటీలను ప్రకటించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ఆర్, శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

బీటీ-3 పత్తి విత్తనాలు అమ్మితే జైలే

మరిపెడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బీటీ-3 పత్తి విత్తనాలు అమ్మితే జైలేనని మరిపెడ ఏడీఏ విజయ్‌చంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని గుండెపూడిలో బీటీ 3 పత్తి విత్తనాలపై రైతులకు స్థానిక వ్యవసాయ, పోలీస్‌శాఖల సమన్వయంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా ఏడీఏ విజయ్‌చంద్ర పాల్గొని మాట్లాడారు. గుండెపూడి కేంద్రంలో కొందరు బీటీ 3 పత్తి విత్తనాలు రైతులకు విక్రయిస్తూ మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వారు పద్ధతి మార్చుకోవాలని లేనట్లయితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ మాట్లాడుతూ నకిలీ, నిషేధిత ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే అమలయ్యే శిక్షలపై విశదీకరించారు. కార్యక్రమంలో ఎంఏవో వీరాసింగ్, ఏఈవో సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.



గుండెపూడిలో రైతు అవగాహన సభలో మాట్లాడుతున్న మరిపెడ ఏడీఏ విజయ్‌చంద్ర

అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పటిక పట్టివేత



పోలీసులు పట్టుకున్న బెల్లం ట్రాలీ, నిందితులు

హసన్‌పర్తి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పటికను స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసి నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం... కాకతీయ యూనివర్సిటీ పోలీసుస్టేషన్ పరిధి దేవన్నపేట క్రాసు రోడ్డు వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ట్రాలీలో సుమారు రూ.1.20 లక్షల విలువ చేసే 15 క్వింటాళ్ల బెల్లం, రూ.8400 విలువ చేసే 140 కిలోల పటిక పట్టుకోవడం జరిగిందని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అప్పరాజుపల్లి పుట్లం తండాకి చెందిన మాలోతు నరేష్, గూడూరు మండలం కొల్లాపూర్ ఇప్పల తండాకు చెందిన లావుడ్య రవీందర్‌లు జహీరాబాద్ ఏరియాలో బెల్లం, పటికను కొనుగోలు చేసి వారి గ్రామాలకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పటికను, ట్రాలీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

ఓరుగల్లులో బీఆర్ఎస్ రజతోత్సవ సభ

(3వ పేజీ తరువాయి)

ఈ సభతో దేశం మొత్తం తెలంగాణ ఉద్యమం వైపు చూసింది. ఆ తరువాత 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌ను జాతీయ పార్టీగా మార్చాలనే లక్ష్యంతో 2022అక్టోబరు 5న భారత్ రాష్ట్ర సమితిగా పేరు మార్చారు. బీఆర్ఎస్ పేరుతో పోటీ చేసి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయింది. పార్టీకిగెలుపోటములు సహజమే అయినప్పటికి మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో శ్రేణులు చేజారకుండా పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని నేతలు నిర్ణయించినట్లుగా సమాచారం.

క్యాడర్‌లో జోష్ నింపేలా..

వరుసగా ఎన్నికల్లో ఓటములు, కీలక నేతలు పార్టీ మారటంతో క్యాడర్ డీలా పడుతోంది. 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 స్థానాల్లో కేవలం స్టేషన్‌ఘనపూర్, జనగామ స్థానాల్లోనే ఎమ్మెల్యేలు గెలిచారు. ఈ ఇద్దరిలో స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. పార్టీ అధికారం కోల్పోవడం, గెలిచిన ఇద్దరిలో ఒక ఎమ్మెల్యే పార్టీ మారటంతో నిరుత్సాహంలో ఉన్న కార్యకర్తలకు.. 2024 మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికలు కూడా ఉపశమనం ఇవ్వలేదు. ఆ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఒక్కసీటు దక్కించుకోలేదు. వరంగల్ లోక్‌సభ పరిధిలో మూడోస్థానానికి పరిమితం కావటం క్యాడర్‌ను మరింత కుంగతీసింది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఓటమే దక్కింది. వీటితో ఇటీవల జరిగిన మూడు ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేయలేదు. కనీసం ఎవరికి బహిరంగంగా మద్దతు కూడా ఇవ్వలేదు. దీంతో పార్టీ క్యాడర్ తీవ్ర నిరాశ, నిస్పృహలో ఉంది. ఈ నేపథ్యంలో పార్టీ 25ఏళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించి, క్యాడర్‌లో జోష్ నింపాలని గులాబీ పార్టీ భావిస్తోంది. ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ తదితర దక్షిణ తెలంగాణ జిల్లాల్లో బీఆర్ఎస్ కొంత ప్రభావం ఉన్నా.. ఉత్తర తెలంగాణలోనే వరుస ఓటములతో క్యాడర్ డీలా పడిపోయారనే టాక్ ఉంది. దీంతో వరంగల్ కేంద్రంగా సభ నిర్వహణతో వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నల్లగొండ, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని క్యాడర్‌లో కదిలిక తీసుకరావచ్చునని గులాబీ బాస్ ఆలోచిస్తున్నట్లుగా పార్టీ నేతలు పేర్కొంటున్నారు. అయితే సెప్టెంబరు నెలలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకునే అవకాశం ఉండగా.. వరంగల్ సభ తరువాత పార్టీ సభ్యత్వాల ప్రక్రియ పూర్తి చేసి, గ్రామ, వార్డు, మండల, జిల్లా కమిటీలకు కూడా ఎన్నికలు పూర్తి చేయాలని పార్టీ భావిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ కమిటీలు కీలక పాత్ర పోషించే అవకాశం ఉండటంతో కమిటీల నియామకం చేయాలని సమావేశంలో పలువురు నేతలు సూచించినట్లు సమాచారం. బడ్జెట్ సమావేశాల అనంతరం పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ నిర్వహించిన

ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్, శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2290	2100
పల్లికాయ (సూక)	7110	6500
పల్లికాయ (పచ్చిది)	5150	4400
కందులు	6868	5540
పెసళ్లు	7002	4645
పత్తి	7020	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14100	9000
డిడి	13010	12500
వండర్‌హాట్	17500	11500
ఎల్లో మిర్చి	17000	15000
యూఎస్341	14000	9500
దేశీ	28000	25500
సింగిల్‌పట్టి	40000	40000
దీపిక	17200	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

కొండా సురేఖ



రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్‌గా పేరు పొందిన కొండా సురేఖ ఉమ్మడి జిల్లా రాజకీయ చరిత్రలో తనదైన విశిష్టతను నిలబెట్టుకున్నారు. రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. శాయంపేట (రద్దయిన) నియోజకవర్గం నుంచి రాజకీయ ప్రస్థానం మొదలవగా.. 1999, 2004, 2008 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో మొదటిసారి మంత్రి అయ్యారు. 2014లో బీఆర్ఎస్‌లో చేరి వరంగల్ తూర్పు నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ సభ్యురాలిగా విజయం సాధించి.. రేవంత్ రెడ్డి కెబినెట్‌లో రెండో సారి మంత్రి పదవిని అలంకరించారు.

సీతక్క



ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ పటంలో దనసరి అనసూయ అలియాస్ సీతక్క ప్రస్థానం ఆసక్తిదాయకం. నక్సల్స్ నేపథ్యం నుంచి వచ్చిన సీతక్క రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. ములుగు నియోజకవర్గం ఓటర్లపై తనదైన ముద్ర వేశారు. 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో ఆ పార్టీ తరుపున పోటీ చేసి రెండోసారి విజయం సాధించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన బరిలో దిగి మరోసారి సంచలన విజయం సాధించి సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో స్థానం సంపాదించారు.

గుండు సుధారాణి



ప్రస్తుతం వరంగల్ నగర పాలక సంస్థ మేయర్‌గా ఉన్న గుండు సుధారాణి రాజకీయ ప్రస్థానం సుదీర్ఘమే. మొదట్లో తెలుగుదేశం పార్టీలో క్రియాశీల పాత్రపోషించారు. చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో పార్టీ పరంగా పలు రాష్ట్రస్థాయి పదవులను నిర్వహించారు. 2002 నుంచి 2004 వరకు టీటీడీ బోర్డు మెంబర్‌గా కూడా పని చేశారు. 2010 నుంచి 2016 వరకు రాజ్యసభ సభ్యురాలుగా ఉన్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి.. ప్రస్తుత రాజకీయ పరిస్థితులతో కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు.





నారీ.. విజయభేరి

ఓరుగల్లు రాజకీయ యవనికపై మెరిసిన అతివలు

- చట్టసభల్లో అడుగుపెట్టిన పలువురు మహిళా నేతలు
- జడ్పీ, కార్పొరేషన్, మున్సిపల్ చైర్‌పర్సన్లుగానూ సత్తా

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

హనుమకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళలు.. పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మరీ ముఖ్యంగా రాజకీయాల్లో తమదైన సత్తా చాటుతూ.. చట్టసభల్లో అడుగుపెడుతూ.. ప్రజాప్రతినిధులుగా ప్రత్యేకతను చాటుతున్నారు. ఎంపీలుగా, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా.. మంత్రులుగా ప్రజాసేవలో తరిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1952 నుంచి ఇప్పటి వరకు జరిగిన 16 సాధారణ ఎన్నికల్లో చెన్నూరు (రద్దయిన) మహబూబాబాద్, నర్సంపేట, పరకాల, శాయంపేట (రద్దయిన), ములుగు, వరంగల్ తూర్పు నియోజకవర్గాల నుంచి 8 మంది మహిళలు అసెంబ్లీలో అడుగుపెట్టగా, ముగ్గురు పార్లమెంట్‌లో పాగా వేసారు. అలా ఉమ్మడి జిల్లా నుంచి లోక్‌సభలో అడుగుపెట్టిన తొలి మహిళగా డాక్టర్ కల్పనాదేవికి దక్కగా.. అలాగే అసెంబ్లీలో తొలి మహిళా ఎమ్మెల్యేగా కాలుమోపిన ఘనత కనకరత్నమ్మకు దక్కింది. ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్యేగా ఎక్కువసార్లు విజయం సాధించిన రికార్డు కొండా సురేఖకు దక్కుతుంది.

ఎర్రబెల్లి స్వర్ణ



ఉమ్మడి జిల్లాలో మరో సీనియర్ మహిళా నేత ఎర్రబెల్లి స్వర్ణ. సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు. వరంగల్ నగర పాలక సంస్థ మాజీ మేయర్. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేకపోయినా.. ఇప్పటికీ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. మేయర్‌గా పనిచేసిన సమయంలో నగరాభివృద్ధికి తనవంతు కృషి చేశారు.

డాక్టర్ కడియం కావ్య



రాజకీయాల్లోకి ప్రవేశించిన మరో కొత్త తరం మహిళా నేత డాక్టర్ కడియం కావ్య. మాజీ మంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు అయిన కావ్య ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ నుంచి కాంగ్రెస్ తరుపున అనూహ్య విజయం సాధించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి లోక్‌సభలోకి అడుగుపెట్టిన మహిళా నేతల్లో డాక్టర్ కావ్య మూడోవారు. వృత్తిరీత్యా డాక్టర్ అయిన కావ్య.. ప్రవృత్తి రిత్యా సంఘసేవకురాలు. స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలను ఎప్పటి నుంచో చేస్తున్నారు. ఈ క్రమంలో రాజకీయాలవైపు మొగ్గు చూపి తొలిప్రయత్నంలోనే విజయం సాధించారు.

విమలాదేవి

1967 ఎన్నికల్లో చెన్నూరు (రద్దయిన) నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా నెమురుగొమ్ముల విమలాదేవి ఎన్నికయ్యారు. మాజీ మంత్రి యతిరాజారావు సతీమణి అయిన విమలాదేవికి రాజకీయాలు తెలియకపోయినా భర్త యతిరాజారావు ప్రోద్భలంతో అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. చెన్నూరు నుంచి గెలిచిన ఏకైక మహిళా ఎమ్మెల్యే ఆమెనే. నియోజకవర్గం రద్దయ్యేనాటికీ మరో మహిళ ఎమ్మెల్యేగా గెలవలేదు. ఆ తర్వాత విమలాదేవి వరంగల్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కూడా పని చేశారు.

సత్యవతి రాథోడ్



సత్యవతి రాథోడ్ కూడా రాజకీయ రంగంలో తనదైన ప్రత్యేకతను నిలబెట్టుకుంటున్నారు. 2009 ఎన్నికల్లో డోర్నకల్ నియోజవకర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేసిన సత్యవతి రాథోడ్ సీనియర్ నేత రెడ్యానాయక్‌పై గెలుపొంది మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2014లో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ అధినాయత్వం ఎమ్మెల్సీ సీటు ఇవ్వడంతో పాటు సీఎం కేసీఆర్ కేబినెట్‌లో ఆమెకు చోటు కూడా కల్పించారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి శాఖ మంత్రిగా పనిచేసిన ఆమె ఇప్పుడు మరోసారి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ రేస్‌లో ఉన్నారు.

మాలోత్ కవిత



మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన మాలోతు కవిత కూడా రాజకీయాల్లో తన శైలిలో రాణిస్తున్నారు. మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ కూతురైన కవిత.. తండ్రి రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తొలి మహిళ కవితనే కాగా గత లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి బీఆర్ఎస్ తరపున పార్లమెంట్‌లో కూడా అడుగుపెట్టారు.

కనకరత్నమ్మ

నర్సంపేట నియోజకవర్గంలో సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తొలి మహిళా ఎమ్మెల్యే కాకుమాను కనకరత్నమ్మ. 1975 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలిచిన కనకరత్నమ్మ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. సహజంగానే సంఘ సేవకురాలైన ఆమె.. ప్రజలకు ఎంతో చేరువయ్యారు. ప్రజాసేవలో తనదైన ముద్రను వేశారు. ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన ఏకైక మహిళగా నేటికీ ఆమె పేరు నిలిచింది.

బండారు శారారాణి

రాజకీయంగా ఓనమాలు కూడా తెలియని బండారు శారారాణి మొదటి సారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. పరకాల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఆ పార్టీ ప్రభంజనంలో అనూహ్యంగా గెలిచారు. రాజకీయంగా ఎంత వేగంగా వచ్చారో అంతే త్వరగా నిష్క్రమించారు. ఆనారోగ్యకారణంగా ఆమె మరణించారు.

యశస్విని రెడ్డి



గత అసెంబ్లీ ఎన్నికల్లో యువకెరటంలా వచ్చిన మహిళా నేత, విద్యాధికురాలు యశస్వినీరెడ్డి. కాంగ్రెస్ అభ్యర్థిగా పాలకుర్తి నియోజకవర్గం నుంచి పోటీ చేసి సీనియర్ నేత, విజయాలతో తిరుగులేని ప్రజాప్రతినిధిగా ఉన్న ఎర్రబెల్లి దయాకర్ రావుపై అనూహ్య విజయం సాధించి రికార్డు సృష్టించారు. పాలకుర్తి నియోజవకర్గంలో సరికొత్త రాజకీయాలకు శ్రీకారం చుట్టారు. మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆమె ఇప్పుడు తనదైన శైలిలో ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

పుల్లా పద్మావతి



రాజకీయాల్లో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగి ఆ తర్వాత కనుమరుగైన మరో మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి. ఈమె గతంలో జిల్లా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. పరకాల నియోజకవర్గం నుంచి పలుసార్లు అసెంబ్లీకి పోటీ చేసినప్పటికి గెలుపొందలేక పోయారు. ఎమ్మెల్సీగా శాసనమండలిలో అడుగుపెట్టారు.

కాకుమాను పద్మావతి

నగర పాలక సంస్థ మేయర్‌గా పని చేసిన మహిళా నేతల్లో కాకుమాను పద్మావతి ఒకరు. పద్మావతి కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉన్నప్పటికీ ఆమె ఎప్పుడూ రాజకీయాలకు దూరంగానే ఉంటూ వచ్చారు. నగర పాలక సంస్థ ఎన్నికల సందర్భంగా ఆమె అనూహ్యంగా తెరపైకి వచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో నిలిచి మేయర్‌గా ఎన్నికయ్యారు. ఈమె కూడా ఎంత వేగంగా రాజకీయాల్లోకి వచ్చారో అంతే త్వరగా కనుమరుగయ్యారు. మేయర్ పదవీ కాలం ముగిసిన తర్వాత తెరమరుగయ్యారు.

జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లుగా..

పలువురు మహిళలు జిల్లా పరిషత్ చైర్ పర్సన్లుగా ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో పాలుపంచుకున్నారు. గతంలో చెన్నూరు (రద్దయిన) మాజీ ఎమ్మెల్యే నెమురుగొమ్ముల విమలాదేవి ఉమ్మడి వరంగల్ జిల్లా పరిషత్ తొలి చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత రెండో మహిళా జడ్పీ చైర్‌పర్సన్‌గా ధన్వంతి, మూడో చైర్‌పర్సన్‌గా గద్దల పద్మ పని చేశారు. జిల్లాల పునర్విభజన ఫలితంగా జడ్పీల విభజన జరిగింది. తత్ఫలితంగా ఏర్పాటైన వరంగల్ జిల్లా పరిషత్‌కు తొలి జడ్పీ చైర్‌పర్సన్‌గా గండ్ర జ్యోతి, ములుగు జడ్పీ చైర్‌పర్సన్‌గా బడే నాగజ్యోతి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా జడ్పీచైర్‌పర్సన్‌గా జక్కు శ్రీహర్షిణి పని చేశారు. కాగా, పురపాలక సంఘాల చైర్‌పర్సన్లుగా కూడా మహిళలు రాణించారు. వీరిలో భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వెంకటరాణి, మరిపెడ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా సిందూర రాణి, వర్ధన్నపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఆంగోతు అరుణ, నర్సంపేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా గుంటి రజనీ తమ పదవులకు న్యాయం చేశారు.

మన దీప్తి.. విశ్వ కీర్తి..

- ఓరుగల్లు సత్తాను ప్రపంచానికి చూపిన పారా ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత
- అంగవైకల్యాన్ని సైతం జయించిన కల్లెడ ఆణిముత్యం



పారాలింపియన్, అర్జున అవార్డు గ్రహీత జీవాంజి దీప్తి

వరంగల్ స్పోర్ట్స్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): కడు బీదరికం ఒక వైపు.. మానసిక వైకల్యం ఇంకోవైపు చుట్టుముట్టినా లక్ష్యం ముందు అవేం సమస్యలు కావని.. కఠోర సాధనతో ఏదైనా సాధించగలమని నిరూపించింది జీవంజి దీప్తి. పారాఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సాధించి.. ఇటీవల అర్జున ఆవార్డు అందుకుని.. ఓరుగల్లు కీర్తిని, వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసింది కల్లెడ ఆణిముత్యం.. పరుగుల చిరుత జీవాంజి దీప్తి. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవాంజి దీప్తి సాధించిన విజయాలపై ప్రత్యేక కథనం. అంగవైకల్యం కారణంగా సమాజంలో ఎన్నో అవమానాలను, సూటిపోటీ మాటలు ఎదుర్కొంది. అయినా వాటిని లెక్కచేయకుండా తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు అహర్నిశలు శ్రమించింది. గతేడాదిలో పారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్స్‌లో మహిళల 400మీటర్ల టీ20 పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచింది. కాంస్య పతకంతో మెరిసి అంతర్జాతీయ వేదికపై ఓరుగల్లు కీర్తి ప్రతిష్ఠలను రెపరెపలాడించింది. దివ్యాంగురాలైన దీప్తి.. ఎన్నో అవమానాలు ఎదురైనా.. ఆత్మవిశ్వాసంతో పరుగు తీసింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడలో గ్రామంలో మొదలైన ప్రస్థానం.. హైదరాబాద్ మీదుగా సాగి ఆసియా పారా క్రీడలు, ప్రపంచ పారాఒలింపిక్స్‌లో పాల్గొని కాంస్య పతకం సాధించే వరకు కొనసాగింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం హనుమకొండ నగర శివారులో 500 గజాల నివాస స్థలంతో పాటు గ్రూప్-2 ఉద్యోగావకాశం కల్పించింది. అలాగే కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమెకు ప్రతిష్టాత్మక అర్జున అవార్డును అందజేసి గౌరవించింది.

ఆత్మ విశ్వాసంతో లక్ష్యాన్ని చేరుకోవచ్చు..

జీవాంజి దీప్తి, పారా ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత

ఆత్మ విశ్వాసంతో కఠోర సాధన చేయడం ద్వారా లక్ష్యాన్ని అందుకోవచ్చు. కోచ్‌ల తర్ఫీదులను పాటించడంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల తోడైతే క్రీడల్లో రాణించొచ్చు. పేదరిం, మానసిక వైకల్యం వేధిస్తూ.. వాటిని పట్టించుకోకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహం, కల్లెడ ఆర్డీఎఫ్ పాఠశాల ఫౌండర్ రామ్మోహన్‌రావు, పీఈటీ సహకారంతో అథ్లెటిక్స్‌లో ఓనమాలు దిద్దా. అక్కడ నా ప్రతిభను గుర్తించిన మా పీఈటీ.. మరింత శిక్షణ ఇప్పించేందుకు 2016లో ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ వద్ద చేర్పించారు. ఆ తర్వాత రమేష్ అన్నీ తానై భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్)లో చేర్పించి అత్యుత్తమ శిక్షణ అందించారు. అదే విధంగా జాతీయ బాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ సహకారం కూడా తోడవడంతో నేను ఈ స్థాయికి చేరుకున్నా.

'ఆమె'కు అండగా...

- మహిళల భద్రత కోసం షీటీమ్
- గ్రేటర్ వరంగల్‌లో మూడు బృందాలతో నిఘా
- పనిప్రాంతాల్లో, కళాశాలల్లో అవగాహన సదస్సులు



వరంగల్ క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అబలలు కాదు.. మీరు సబలలంటూ మహిళలో ధైర్యాన్ని నింపుతున్నారు షీటీమ్ పోలీసులు. మహిళల భద్రత కోసం పోలీసు శాఖ షీటీంను ప్రారంభించింది. ఆకతాయిలు కళాశాల విద్యార్థినులను, మహిళలను వేధింపులకు గురిచేయకుండా రద్దీ ప్రాంతాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్లు, కళాశాలల వద్ద షీటీమ్ పోలీసులు మఫ్టీలో గస్తీ కాస్తూ ఆకతాయిల ఆట కట్టిస్తున్నారు. ఆదుపులోకి తీసుకుని శిక్షిస్తున్నారు. పనిచేసే ప్రాంతాల్లో లైంగిక వేధింపులకు గురిచేసినా, మానసికరంగా ఇబ్బందులు పెట్టినా సమాచారం అందిన నిమిషాల వ్యవధిలో అక్కడకు చేరకుని మహిళలను రక్షిస్తున్నారు. మహిళలు ఆపద సమయాల్లో భద్రత కోసం ప్రత్యేక ఏర్పాటైన షీటీమ్‌ను సంప్రదించాలని షీటీం ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో ఉన్న (హనుమకొండ, వరంగల్, కాజీపేట) ట్రైసిటీలో అవగహన సదస్సులు నిర్వహిస్తూ మహిళలకు ధైర్యాన్ని ఇస్తున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో 2015 ఏప్రిల్ 10న షీటీం ప్రారంభమవగా కమిషనరేట్‌లో ఇప్పటి వరకు 1607 మంది బాధితులు షీటీమ్‌ను ఆశ్రయించారు. ఈ క్రమంలో 109 మందిపై వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని, 542 మందికి కౌన్సెలింగ్ ఇచ్చామని, 739 పెట్టి కేసులు నమోదు, 748 అవగాహన సదస్సులను ఏర్పాటు చేశామని షీటీమ్ ఇన్స్‌పెక్టర్ కోడూరి సుజాత తెలిపారు. మహిళలు ప్రయాణాలు చేసేటప్పుడు టీ-సేఫ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని గమ్యం వివరాలు, వాహన నెంబర్ నమోదు చేస్తే గమ్యం చేరుకునే వరకు పోలీసులు నిఘా పెట్టి అప్రమత్తం చేస్తారని, దీనిని ప్రయాణాలు చేసే మహిళలు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సోషల్ మీడియా పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అత్యాచార బాధితులకు భరోసా

అత్యాచార బాధితులతో పాటు పోక్సో బాధితుల కోసం కమిషనరేట్ పరిధిలో 2020 సంవత్సరం జూన్‌లో ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం బాధితులకు బాసటగా నిలుస్తోంది. హనుమకొండ రంగంపేటలో ఉన్న భరోసా సెంటర్‌లో కౌన్సిలర్‌లు, సపోర్టర్స్ వైద్య సిబ్బంది, న్యాయవాది అందుబాటులో ఉండి వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో మోసపోయిన మహిళలకు తోడుగా నిలిచి వారి తరుపున పోరాడి ఆశ్రయం కల్పిస్తూ స్వయం ఉపాధి ఆవకాశాలు కల్పిస్తున్నారు. ఎఫ్ఐఆర్ నమోదై జడ్జిమెంట్ వచ్చేంతవరకు దశల వారీగా పోక్సో కేసులో రూ.1,00,000, అత్యాచారం కేసులో రూ.50,000 అందిస్తున్నారు. 2020 నుంచి ఇప్పటి వరకు 720 కేసులు నమోదు కాగా, 466 పోక్సో, 178 అత్యాచారం, 78 మిస్సింగ్ కేసులు నమోదు అయ్యాయి. బాధిత మహిళలకు పరిహారం కింద ఇప్పటి వరకు 376 కేసులలో కోటి 45లక్షల పరిహారం అందించినట్లు భరోసా గణంకాలు చేప్తున్నాయి. అదే విధంగా ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం 73 మంది బాధిత మహిళలకు రూ. 4,59,400 అందజేశారు.

ఆపద సమయాల్లో మహిళలు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు

సీసీ వాట్సాప్ నెంబర్ 8712685257

షీటీం : 8712685142

ఉమెన్ హెల్ప్‌లైన్ : 181



అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గంగినేని అఖిల

అమ్మ ప్రోద్బలంతో లా చేశా

భూపాలపల్లిటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): 'నాకు సివిల్స్ సాధించాలన్న ఆసక్తి ఉండేది. కానీ అమ్మ మాట, ఆమె ఇచ్చిన ప్రోద్బలంతో లా చేశా. మాది పేద కుటుంబం. ఉన్నత చదువులు చదివిన వారు లేరు. అందుకే నేను, మా అక్కను ఓ స్థాయిలో చూడాలని అమ్మానాన్న అనుకున్నారు. ఈ క్రమంలోనే నేను ఉన్న స్థాయి అధికారిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నా. అందుకే అమ్మ చెప్పగానే లా చేశా' అని తెలిపారు జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు జూనియర్ సివిల్ జడ్జి గంగినేని అఖిల. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. ఖమ్మం నగరానికి చెందిన గంగినేని శ్రీనివాసరావు, పద్మ దంపతుల రెండో కూతురైన అఖిల ఇంటర్ వరకు ఖమ్మంలో,


మహిళలు నచ్చిన మార్గాన్ని ఎంచుకోవాలి ● వారికి కుటుంబసభ్యులు సహకరించాలి

జయశంకర్ భూపాలపల్లి అదనపు జూనియర్ సివిల్ జడ్జి గంగినేని అఖిల

గ్రాడ్యుయేషన్ గీతం యూనివర్సిటీలో చదివారు. 2013లో బీఏ ఎల్ఎల్‌బీ పూర్తి చేశాను. ఈ క్రమంలో ఐదు సంవత్సరాలు యూనివర్సిటీ టాపర్‌గా నిలవడమే కాకుండా గోల్డ్‌మెడల్ కూడా సాధించారు. ఆ తర్వాత 2023లో భూపాలపల్లిలో ఉద్యోగంలో చేరారు. ఆమె అక్క కూడా హైకోర్టులో న్యాయవాదిగా ఉన్నారు. తనకు తొలుత సివిల్స్ అంటే ఎంతో ఇష్టమని, కానీ తన తల్లి ప్రోబ్బలంతో 'లా'లో చేరానని, మొదటి సంవత్సరం పూర్తయ్యే సరికి తనకు జడ్జి కావాలని పట్టుదల వచ్చిందని అఖిల వివరించారు. దీని ద్వారా మానవాళికి సంబంధించిన అన్ని అంశాలు, విభాగాలపై అవగాహన కలుగుతుందన్నారు. మహిళలు, యువతులు వారికి నచ్చిన మార్గాన్ని ఎంచుకోవాలని, దానిని సాధించడం కోసం కృషి చేయాలని, వారికి కుటుంబసభ్యులు కూడా సహకరించాలని సూచించారు. మహిళలే కదా అని వారి మనోభావాలను దెబ్బతీయకూడదదని, ఇప్పుడు అన్ని రంగాల్లో మహిళలు సత్తాచాటుతున్నారన్నారు. మహిళలు, యువతులు కూడా లక్ష్యాలను చేరుకునేందుకు సెల్ఫ్ మోటివేషన్ అవసరమన్నారు. రక్షణ కోసం ఎన్నో చట్టాలున్నాయని అందరూ వాటిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇక భూపాలపల్లి జిల్లాలో ఇప్పటివరకు సుమారు 3వేల కేసుల వరకు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని, ఈ ఉద్యోగం ఓ సవాల్ లాంటిదని చెప్పుకొచ్చారు.

సాధారణ గృహిణి.. 25మందికి నాయకత్వం

సత్తా చాటుతున్న ముల్కనూర్ మహిళా డెయిరీ చైర్‌పర్సన్



మడిపల్లి పాల కేంద్రంలో పాలు పోస్తున్న బుర్ర ధనశ్రీ

భీమదేవరపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇమె ఓ సాధారణ గృహిణి... ఇంటర్ వరకు చదివారు.. అయితేనేం దేశంలోని మొట్టమొదటి మహిళా డెయిరీకి అధ్యక్షురాలయ్యారు. అంతేకాదు ఆమె ఆ మహిళా డెయిరీని విజయ పథంలో నడుపుతున్నారు. సుమారు 25వేల మంది మహిళా సభ్యులకు నాయకత్వం వహిస్తూ.. ఏడాదికి రూ.200కోట్ల టర్నోవర్‌కు మార్గదర్శకరాలిగా నిలిచారు. ప్రతిష్టాత్మక ముల్కనూర్ మహిళా డెయిరీని లాభాల బాటలో నడిపిస్తున్న బుర్ర ధనశ్రీ మహిళలకు ఆదర్శంగా నిలిచారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆమె 2002లో ప్రారంభమైన ముల్కనూర్ మహిళా డెయిరీకి 2022లో అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆమె స్వయంగా పాలు పితికి కేంద్రంలో పోస్తూనే తన అధ్యక్ష విధులు కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. సిబ్బంది, పాలకవర్గం, మహిళా సభ్యుల సహకారంతో 70వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. ప్రతీ 15రోజులకు రూ.5కోట్ల పాడి రైతులకు బిల్లులను చెల్లిస్తున్నారు. డెయిరీ పరిధిలోని 200 సంఘాల్లో, డెయిరీ కేంద్రంలో కంప్యూటరీకరణ పూర్తి చేశారు. పాలు, పాల పదార్థాలను కూడా మార్కెట్లోకి విడుదల చేస్తున్నారు. భవిష్యత్తులో ముల్కనూర్ మహిళా డెయిరీ ద్వారా లక్ష లీటర్ల పాలను సేకరించేలా కృషి చేస్తున్నామని ధన శ్రీ చెబుతున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రేగొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లుగా ఎస్సై షా ఖాన్ తెలిపారు. శుక్రవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రెండు వాహనాలు ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించాయి. దీంతో వారిని విచారించి తనిఖీలు చేయగా రెండు వాహనాలలో 115 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని గుర్తించినట్లు తెలిపారు. హొంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా బియ్యం తరలిస్తున్న వాహనాలను స్వాదీనం చేసుకున్నామన్నారు. అక్రమంగా తరలిస్తున్న పుట్ట జలందర్, కక్కెర్ల సదానందం, ములుగూరి గణేష్‌ల పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

ఏటూరునాగారం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రేణుక అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కస్తూర్బా మహిళా మండలి వృద్ధాశ్రమం వ్యవస్థాపకురాలు కొమరగిరి సామ్రాజ్యం, జీసీడీవో సుగుణ, ఎస్‌వో శ్యామల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రేణుక, సామ్రాజ్యం మాట్లాడుతూ.. మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, సమాజానికి తమ వంతు సేవ చేయాలని పిలుపు నిచ్చారు. అంతేకాకుండా విద్యార్థులకు సూచనలు చేస్తూ, వివిధ రంగాల్లోని మహిళా ప్రముఖుల గురించి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సిహెచ్.



మహదేవపూర్‌లో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

వెంకటయ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి. జ్యోతి, కళాశాల అధ్యాపక బృందం సంపత్, మున్ని, జీవవేణి, శేఖర్, సుమలత, రమేష్, అభిలాష్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

● మహదేవపూర్, : మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వంగపల్లి పరశురాములు ఆధ్వర్యంలో ముందస్తుగా మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను సన్మానించారు. మహిళల అభ్యున్నతికి తోడ్పడాలన్నారు. డాక్టర్ మాధవి, డాక్టర్ రజిత, కె.రమయ్య, కరీంబీ, బాగ్యలక్ష్మి, నాన్ టీచింగ్ సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జన్ను విజయ్ కుమార్ మాట్లాడారు. డాక్టర్ పి.రాజు, శాఖ మూరి రవీందర్, కె.మున్నయ్య, జి.రమేష్, సీహెచ్. రాజేందర్, జి.రవీందర్ సిబ్బంది పాల్గొన్నారు.

పొదెం వీరయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

వెంకటాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని మండల కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజ్‌ను కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో నాయ కులు చిడెం శివ, మన్నెం సునీల్, పిల్లారిశెట్టి మురళి, గార్లపాటి రవి పాల్గొన్నారు.

హిందీ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

గోవిందరావుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి విద్యార్థులు రూపొందించిన హిందీ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం మండలంలోని పస్రా ఉన్నత పాఠశాలలో జరిగింది. హిందీ పాఠ్యపుస్తక రచయిత షేక్ హాజీ నూరానీ మార్గనిర్దేశకత్వంలో రూపొందించిన ఈ స్టడీ మెటీరియల్‌ను పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సమ్మేశ్వర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అపార అనుభవం కలిగిన హిందీ పాఠ్యపుస్తక రచయిత, స్టేట్ రిసోర్స్‌పర్సన్ అయిన హాజీ నూరానీ నేతృత్వంలో విద్యార్థులే స్వయంగా తమకు కావాల్సిన స్టడీ మెటీరియల్‌ను వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకుని తయారు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. ఉపాధ్యాయులు సమ్మయ్య, నరేందర్, రాజయ్య, హేమలత, ఝాన్సీ, శారద, రామరాజు పాల్గొన్నారు.

జనరిక్ మందులపై అవగాహన

టేకుమట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిశాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జన ఔషధి దివస్ సందర్భంగా ప్రజలకు జనరిక్ మందులపై వైద్యాధికారి శృతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనరిక్ మందులలో 50 నుంచి 60 శాతం తక్కువ ధరలో లభిస్తాయని తెలిపారు. ప్రయివేటుగా వాడే మందులు అధిక ధరలో ఉంటాయనీ, అందుకుగాను జనరిక్ షాప్‌లలో కొనుగోలు చేయడం వల్ల తక్కువ ధరకే మందులను పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు మధురిమ, విజయ, ఫార్మాసిస్ట్ విద్యాసాగర్, ల్యాబ్ టెక్నీషియన్ బుచ్చిబాబు, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, స్టాఫ్ నర్సు చిత్ర, డీఈఓ రమేష్, ఏఎన్‌ఎం రేణుక, సిబ్బంది కృష్ణస్వామి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులపై చర్య తీసుకోవాలి

వాజేడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వాజేడు మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని మూసివేసిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నవ నిర్మాణ సేన మండల అధ్యక్షుడు మోడెం నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన సంఘం నాయకులతో కలిసి కార్యాలయాన్ని సందర్శించారు. జిల్లా కలెక్టర్ దివాకర నష్టపోయిన మొక్కజొన్న రైతుల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని ఆదేశాలు ఇచ్చినా మండల వ్యవసాయ అధికారులు బిజినేపల్లి, కృష్ణాపురం, ఇప్పగూడెం గ్రామాలను ఇప్పటివరకు సందర్శించలేదని అన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలను సందర్శించి రైతుల వివరాలు సేకరించాలని, మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని, రైతులను మోసం చేసిన కంపెనీ ఆర్గనైజర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

మొగుళ్లపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలందరూ కలిసికట్టుగా ఉండి సమన్వయంతో పనిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పదవులు కాంగ్రెస్ నాయకులు దక్కించుకుని సత్తా చాటాలన్నారు. నాయకులందరూ ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు. చిట్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ ఎమ్డీ.రఫి, పట్టణ అధ్యక్షుడు ఖ్యాతరాజు రమేష్, మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, నాయకులు ఎర్రబెల్లి పున్నంచందర్‌రావు, యార రవికుమార్, సంజీవరెడ్డి, ప్రకాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

గోవిందరావుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులకు గత రెండునెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల ఇన్‌చార్జి అధ్యక్ష, కార్యదర్శులు గరుగు ఐలయ్య, ఏనె సంపత్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక ఎంపీడీవో జవహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఐలయ్య, సంపత్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కిందని అన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఒకపూట పనికి ఉత్తర్వులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు నూకల కృష్ణ, ఏనె శ్రీను, పసుల రాజయ్య, నద్దునూరి మల్లయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరగాలి

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి

మొగుళ్లపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే కింద పంట భూములు కోల్పోతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం జరిగేలా చూడాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో మొగుళ్లపల్లి, చిట్యాల, టేకుమట్ల, శాయంపేట మండలాల్లో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించిన రైతుల భూముల్లోనుంచి నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం చేపట్టేక్రమంలో వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్న రైతులు భూములను కోల్పోతున్నారని, వారి జీవనాధారమే వ్యవసాయ భూములని అన్నారు. ఈక్రమంలో ఒక్కో ఎకరాకు రూ.15నుంచి రూ.20లక్షలు ప్రభుత్వం ఇవ్వడం బాధాకరమని అన్నారు. తెలంగాణలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరగడం వల్ల రవాణా, ట్రాన్స్‌పోర్టు, ఇన్‌పోర్టు, అవుట్‌పోర్టు జరిగి ఎంతో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు భూములు కోల్పోతున్న రైతులకు ఒక్కో ఎకరానికి రూ.30లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికార ంలోకి వచ్చి 14నెలలు దాటినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరచడంలో పూర్తి విఫలమైందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి

మండలకేంద్రంలోని చౌరస్తాలో నేషనల్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులు మల్కాజగిరి ఎంపీ ఈటల రాజేందర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్లమెంటు సమావేశాల్లో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.30లక్షల చొప్పున పరిహారం అందించాలని ప్రసంగించడం పట్ల క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిషిధర్‌రెడ్డి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మోరె రవీందర్‌రెడ్డి, రైతులు రాజేందర్, సత్యనారాయణరెడ్డి, రామచంద్రరావు, కృష్ణారావు, స్వప్న, వాణి, రమ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి : బీఆర్‌ఎస్



మిర్చిపంటను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ములుగు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చిపంట సాగుచేసి గిట్టుబాటు ధర లేక ఇబ్బందిపడుతున్న జిల్లాలోని రైతులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, మాజీ గ్రంథాలయసంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన నాయకులతో కలిసి ములుగు మండలంలోని సర్వాపూర్‌లో మిర్చి కల్లాలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోవింద్‌నాయక్ మాట్లాడారు. మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాల్‌కు రూ.30వేల ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనట్లయితే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. బీఆర్‌ఎస్ నాయకులు అప్పాజీ ఐలయ్య, ఆవుల లక్ష్మీనారాయణ, జాజ నర్సింహులు, జాడి శ్రీను, తిరుపతి, భిక్షపతి, నరేష్, జనగాం చుక్కయ్య, సల్లూరి గణేష్, భాగ్య, శ్రావణ్, సంతోష్, బాలసాని కనకయ్య, జాజ రాజు, రైతులు పాల్గొన్నారు.

ట్రైబల్ జర్నలిస్టులకు ఐటీడీఏ ద్వారా సహకారం

ఏటూరునాగారం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని ట్రైబల్ జర్నలిస్టులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఐటీడీఏ అన్ని విధాలా సహకరిస్తుందని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా తెలిపారు. శుక్రవారం ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు ముందుగా ఐటీడీఏ పీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. జర్నలిస్టుల శిక్షణ కోసం డీపీఆర్‌వోతో సమన్వయం చేసుకొని ప్రణాళిక రూపొందించాలని, దీనికి జిల్లా కలెక్టర్ అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంటుందని సూచించారు. ఐటీడీఏ తరఫున జర్నలిస్టులకు అందించే ప్రోత్సాహకాలు జైలా ప్రకారం ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని వైజంక్షన్ సమీపంలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకట్, బానోత్ వెంకన్న మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదుకు ఈనెల 14 వరకు గడువు ఉందని, ఆ తర్వాత సభ్యులకు రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ములుగు జిల్లా గౌరవాధ్యక్షులు భూక్య సునీల్, ప్రధాన కార్యదర్శ కుచ్చంటి చిరంజీవి, ఉపాధ్యక్షులు పూనెం ప్రతాప్, కోశాధికారి తుర్స చంటి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, ఏటూరునాగారం డివిజన్ కమిటీ అధ్యక్షుడు రవీంద్రనాథ్, కార్యదర్శి శివలింగ ప్రసాద్ లక్ష్మీనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

వెంకటాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాండ్ మొక్కజొన్న పంట సాగుచేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించే వరకు దశలవారీగా పోరాటం చేస్తామని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు అన్నారు. శుక్రవారం ఆయన నాయకులతో కలిసి మండలంలోని కలిపాక, తిప్పాపురం, కొత్తగుంపు గ్రామాల్లో నష్టపోయిన మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా వాసు మాట్లాడుతూ పంటలు నష్టపోయిన మొక్కజొన్న రైతులకు ఎకరాకు రూ.లక్షా 20వేల పరిహారం అందించాలని తెలిపారు. నాయకులు ఇర్ప శ్రీను, సోలం రంగయ్య, పర్శిక కృష్ణ, మడకం చందర్‌రావు,ఎర్రయ్య పాల్గొన్నారు.

ములుగు ఓఎస్డీ గీతే మహేష్ బదిలీ



గీతే మహేష్ బాబా సాహెబ్

ములుగు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ములుగు ఓఎస్డీ గీతే మహేష్ బాబాసాహెబ్ బదిలీ అయ్యారు. సిరిసిల్ల జిల్లా ఎస్పీగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన మహేష్ బాబాసాహెబ్ సుదీర్ఘకాలం ములుగు ప్రాంతంలో పనిచేశారు. ఏటూరునాగారం ఏఎస్పీగా పనిచేసిన ఆయన ప్రస్తుతం ములుగు ఓఎస్డీగా కొనసాగు తున్నారు. తెలంగాణ సరిహద్దులో మావోయిస్టుల చొరబాట్లకు అడ్డుకట్ట వేయడంలో కీలకంగా వ్యవహరించారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఆయనను సిరిసిల్లకు బదిలీ చేసింది. ఖాళీ అయిన ఆయన స్థానంలో ఎవ్వరినీ నియమించలేదు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పు ప్రదర్శన

ఏటూరునాగారం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అన్ని కులాలకు సమానంగా న్యాయం జరగాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైజంక్షన్ వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వావిలాల స్వామి మాదిగ హాజరై మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణలో 59 షెడ్యూల్ కులాలకు ప్రభుత్వం సంపూర్ణంగా న్యాయం చేయాలని అన్నారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వాజేడు మండలాల ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి డప్పు ప్రదర్శన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పడదెల సతీష్, ఎంఎస్‌పీ వాజేడు మండల అధ్యక్షుడు పేట సమ్మలు, కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు చిట్యాల నరేష్, మండల ప్రధాన కార్యదర్శి కిసరి రాజు, మండల నాయకులు సిహెచ్. రాజు, సాయిబాను తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

వాజేడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బాండ్ కంపెనీ మూలంగా రైతులు నష్టపోయిన ఘణపురం కాలనీ, కొప్పుసూరు, అరుణాచలపురం, ఆరుగుంటపల్లి, బొల్లారం గ్రామాల్లోని మొక్కజొన్న పంటను శుక్రవారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్రకమిటీ సభ్యుడు జెజ్జరి దామోదర్ మాట్లాడుతూ మండలంలో పలు రకాల మొక్కజొన్న కంపెనీలు ఒప్పందం వ్యవసాయంలో నాసిరకం విత్తనాలు ఇవ్వడం వల్ల రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయారని అన్నారు. బహుళజాతి కంపెనీలు రైతులను మోసం చేస్తున్నాయని, ఆయా కంపెనీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని రైతులకు పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు కుర్సం ప్రవీణ్, శాంతకుమారి, కృష్ణబాబు, రైతులు పాల్గొన్నారు.

ఆలయ సమస్యను పరిష్కరించాలి

ఏటూరునాగారం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డులో ఉన్న అభయ ఆంజనేయ స్వామి దేవాలయ సమస్యను పరిష్కరించాలని కొరుతూ బీఆర్‌ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం కరీంనగర్‌లో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులతో కలిసి కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. దేవాలయం తాత ముత్తాతల కాలం నాటిదని, స్వయంభుగా వెలిసిందని భక్తులు నమ్ముతున్నారని, నేషనల్ హైవే అధికారులు ఆ దేవాలయాన్ని, 45 అడుగుల హనుమాన్ విగ్రహ నిర్మాణ పనులను నిలిపివేశారని తెలిపారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేంద్ర మంత్రిని వారు కోరారు. ఇచ్చిన వారిలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు, బీఆర్‌ఎస్ నాయకులు తాడూరి రఘు, ఎమ్డీ. ఖాజా పాషా, గండపల్లి నర్సయ్య, మెరుగు వెంకటేశ్వర్లు, వెనుకొల్లు చక్రవర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ములుగు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ములుగులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ములుగు, పత్తిపల్లి, మల్లంపల్లి, రామచం ద్రాపూర్, పస్రా, గోవిందరావుపేట, వెంకటాపూర్, వెల్తుర్లపల్లి, తాడ్వాయి, మేడా రం, ఏటూరునాగారం, కమలాపూర్, కన్నాయిగూడెం, వాజేడు, మంగపేట, రాజుపేట, ఆలుబాక, మల్లూరు, వెంకటాపురం ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలకు శనివారం సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ములుగు డీఈ నాగేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయా ఉప కేంద్రాల్లో విద్యుత్ మరమ్మతులు ఉన్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

క్రీడాకారులకు టీ షర్టుల పంపిణీ

ములుగు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 8న జరిగే సైక్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న 24మంది క్రీడాకారులకు శుక్రవారం ములుగులో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ రూ.10వేల విలువచేసే టీషర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో తుల రవి, సైక్లింగ్ కోచ్ శ్రీరాంనాయక్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఎలగందుల మోహన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మహాముత్తారానికి బస్సు నడిపించాలి

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహాముత్తారం మండలానికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని మహముత్తారం మాజీ ప్రజాప్రతినిధులు కోరారు. శుక్రవారం డిపో మేనేజర్ ఇందును కలిసి వినతి పత్రాన్ని అందించారు. జిల్లా కేంద్రానికి కేవలం 28 కిలో మీటర్ల దూరంలోనే మహాముత్తారం ఉంటుందన్నారు. బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రైవేటు వాహనాలకు వేలల్లో రూపాయలు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈ విషయమై డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

పద్మశాలి మహాసభకు తరలిరావాలి

భూపాలపల్లి టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న హైదరాబాద్‌లోని నాంపల్లి పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే పద్మశాలి సంక్షేమ సంఘం మహాసభకు వేలాదిగా తరలిరావాలని ఆ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు గోనె భాస్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ పద్మశాలీల సంక్షేమం కోసం ఈ సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కాగా అన్ని మండలాలు, గ్రామాల నుంచి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేర్ కుమార్, సత్యనారాయణ, క్యాతం సతీష్, శ్రీనివాస్, మార్కెండేయ, రవీందర్, చంద్రమౌళి, జి.శ్రీనివాస్, రమేష్, చంద్రశేఖర్, కే.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలెంవాగు ప్రాజెక్టు గుట్టలపై హనీబ్యాడ్జర్

వెంకటాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెంవాగు ప్రాజెక్టు సమీపంలోని గుట్టలపై అరుదైన జంతువు హనీబ్యాడ్జర్ కనిపించినట్లు అటవీ శాఖ అధికారి వంశీకృష్ణ తెలిపారు. శుక్రవారం పాలెంవాగు ప్రాజెక్టు సమీపంలోని గుట్టలపై ఉన్న అటవీ ప్రాంతంలో జంతువుల వేట కోసం అమర్చిన ఉచ్చులో జంతువు చిక్కుకుందని విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి సంఘటన ప్రాంతాన్ని పరిశీలించామని అన్నారు. హనీబ్యాడ్జర్ ఉచ్చులో చిక్కుకుని ఉన్నట్లు గుర్తించామని, దానిని ఉచ్చులో నుంచి బయటకు తీసి అడవిలోకి పంపించినట్లు తెలిపారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసర్ దేవయ్య, బీట్ ఆఫీసర్‌లు ప్రణవి, సరళ, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.



హనీబ్యాడ్జర్

కోటి వరాల కొడవటంచ

(3వ పేజీ తరువాయి)

కళ్యాణమహోత్సవం జరుపుతారు. 11వ తేదీ మంగళవారం నిత్యవి ధి, హోమం, బలిహరణం, గజవాహన, చంద్ర వాహన సేవలు, 12వ తేదీ బుధవారం రోజున నిత్యవిధి, హోమం, బలిహరణములు, సింహ వాహన సేవ, గరుడోత్సవము నిర్వహిస్తారు. 13వ తేదీ గురువారం రోజున నిత్యవిధి, హోమం, బలిహరణం, హనుమంతవాహనసేవ, చిన్నరథసేవ, డోపోత్సవము జరుగుతుంది. 14వ తేదీ శుక్రవార హోమం, బలిహరణం, మహాపూర్ణాహుతి, బోనాలు తిరుగుటతో జాతర ప్రారంభం, ఈ రోజు పెద్దరథోత్సవం, ప్రభబండ్లు, ఎడ్ల బండ్లు వాహనాలు తిప్పడం జరుపుతారు. 15వ తేదీ శనివారం రోజున గజవాహనాల ఊరేగింపు, 16వ తేదీ ఆదివారం చక్రస్నానం, అభిషేకం, స్వామివారి నిజరూప దర్శనం, హంసవాహనసేవ, పుష్పయాగం తదితర పూజలు నిర్వహిస్తారు.

- భక్తులకు సకల ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఆలయ పరిసరాలలో సకల ఏర్పాట్లు చేస్తున్నారు. కోటంచకు భక్తులు చేరుకోవడానికి భూపాలపల్లి, పరకాల నుంచి బస్సు సర్వీసులు నడపనున్నారు. ఆలయ పరిసరాలలో దుమ్ము లేవకుండా ట్యాంకర్లతో నీటిని చల్లడంతోపాటు, గ్రామ పంచాయతీ సిబ్బంది నిత్యం పారిశుద్య పనులు చేయనున్నారు. భక్తులకు తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా మంచినీటి ట్యాంకర్లు, బోరింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అత్యవసర చికిత్స కోసం ఆలయ పరిసరాలలో వైద్య సిబ్బందితో వైద్యశిబిరాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. పోలీసు సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిత్యం పర్యవేక్షణ చేయనున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తున్నారు.

-వీటి ప్రత్యేక దృష్టి సారించరూ..

ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎదుర్కొనే సమస్యలపై అధికారులు ప్రత్యే దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు. జాతరలో నిత్యం వదిలే వ్యర్థాల నిర్వహణ అనేది సమస్యగా మారింది. చెత్తను వేయడానికి పెద్ద పెద్ద కుండీలు ఏర్పాటు చేయాలి. లడ్డూ పులిహోర అనేది స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులు ప్రసాదంగా భావిస్తారు. అలాంటి ప్రసాదం నాణ్యత ఉండట్లేదని భక్తులు ప్రతి ఏటా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడైనా నాణ్యత పాటించేలా ఎమ్మెల్యే అధికారులను ఆదేశించాలని కోరుతున్నారు. పూజా సామగ్రిని ఆలయ పరిసరాలలో ఇష్టారీతిన ధరలు నిర్ణయించి అమ్ముతున్నారు. భక్తులు దోపిడీకి గురవ్వకుండా అధికారులు నిత్యం పర్యవేక్షణ చేసి అమ్మకందారులను హెచ్చరించాలని భక్తులు కోరుకుంటున్నారు. మొక్కుబడిలో భాగంగా యాటలను కోసే భక్తులకు ఆలయ పరిసరాలకు దూరంగా ఉండే ప్రాంతాల్లో విడిది చేసేలా స్థలాలను ఎంపిక చేసి శుభ్రం చేయిస్తే సౌకర్యంగా ఉంటుంది. దీంతో ఆలయ పరిసరాలలో రద్దీ తగ్గించి ఇబ్బందులు లేకుండా చూసుకోవచ్చు

ఎమ్మెల్యే గండ్రకు కోటంచ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు శుక్రవారం కోటంచ ఆలయ కమిటీ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువా కప్పి ఆహ్వానించారు. ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు ముఖ్యఅతిథిగా రావాలని కోరారు. ఆలయ ఈవో మహేష్, ఆలయ చైర్మన్ భిక్షపతి, ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు ఉన్నారు.

వైభవంగా మామిడిగూడెం సమ్మక్క కల్యాణం

మంగపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కొత్తమల్లూరు గ్రామ శివారులో మామిడిగూడెంలో వెలిసిన సమ్మక్క- సారలమ్మ జాతర వైభవంగా ఈనెల 4 నుంచి ఆదివాసి సంప్రదాయాల ప్రకారం నిర్వహిస్తున్నారు. నాలుగో రోజైన శుక్రవారం తెల్లవారు జామున 4 గంటలకు శ్రీ సమ్మక్క- పగిడిద్దరాజు ఉత్సవ మూర్తులకు కల్యాణ క్రతువును ఆలయ దేవరబాల పూనెం జనార్దన్ నిర్వహించారు. మండలంలోని కొత్తమల్లూరు, మల్లూరు, చుంచుపల్లి, మ ల్లూరు మొట్లగూడెం, శనిగకుంట, పూరేడుపల్లి, గాంధీనగర్, నర్సింహసాగర్, గొందిగూడెం, నీలాద్రిపేట, బాలన్నగూడెం, అబ్బాయిగూడెం, తిమ్మంపేట, బీసీ కాలని, చెరుపల్లి, కొత్తపేట, బోరునర్సాపురం, జబ్బోనిగూడెం, బుచ్చంపేట, నర్సాయిగూడెం తదితర గ్రామాల నుంచి సుమారు 12 వేల మంది శ్రీ సమ్మక్క- సారలమ్మ, నాగులమ్మ, పోతురాజు, కిష్టస్వామిలను దర్శించుకున్నారు. అనంతరం వన దేవతలను దర్శించుకొని టెంకాయలు, బెల్లం, పసుపు(బండారి) కుంకుమ, ఒడి బియ్యం, చీరే, సారెలను సమర్పించిన భక్తులు తమ మొక్కలను చెల్లించుకున్నారు. గురువారం రాత్రి నుంచి భక్తులు జాగారాలు ఉన్నారు. వన దేవతల ఉత్సవ మూర్తులను మూళ్ల ఊయలలో పూజారులు, దేవరబాల ఊపారు. ఈ సందర్భంగా శివసత్తులు పూనకాలతో పులకించి సోకుల్లు చెబుతూ భక్తులను ఆకట్టుకున్నారు. ఈ



జాతరలో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

కార్యక్రమాలలో వడ్డె రేగ లక్ష్మయ్య, తలపతి పూనెం వెంకటేశ్వర్లు, దేవర కర్రలు ఆడించేవాళ్ల వాసం సాంబశివరావు, ఎట్టి సాయి, తాటి చందు, నాగమల్లేష్, ఆదివాసి కుల పెద్దలు మారబోయిన గోవర్ధన్, నన్నెబోయిన లక్ష్మణ్‌రావులతో పాటు ఆదివాసి మహిళలు, యువకులు పాల్గొన్నారు.